
సాక్షి
గుంటూరు
మంగళవారం । 12 । సెప్టెంబర్ । 2023



## సాగునీటి సమాచారం


తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5527 క్యూసెక్కులు విడుదల చేశారు.



## 15న వైద్యకళాశాల ప్రారంభం

మచిలీపట్నం: బందరులోని వైద్య కళాశాలను ఈ నెల 15న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నట్లు కృష్ణా కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు.

## 18 ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణ



సత్తెనపల్లి: మధ్యప్రదేశ్ ఓంకారేశ్వరంలో ఈనెల 18న జరగనున్న జగద్గురు ఆదిశంకరాచార్యుల విగ్రహావిష్కరణకు హాజరు కావాలని సత్తెనపల్లి త్రిశక్తి దుర్గా పీఠం అధిపతి వెలిదండ్ల హనుమత్ స్వామిజీకి ఆహ్వానం అందింది.

## న్యూస్‌రీల్

### నేడు కూడా దరఖాస్తులు స్వీకరణ

గుంటూరు మెడికల్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకున్నవారికి తొలుత సోమవారం వరకు గడువు ఇచ్చామని డీఎంహెచ్‌ఓ డాక్టర్ అమర్త లూరి శ్రావణ్‌బాబు తెలిపారు. జిల్లాలో కొన్ని చోట్ల బంద్ కారణంగా దరఖాస్తులు సమర్పించేందుకు అభ్యర్థులు ఇబ్బంది పడినట్లు తమ దృష్టికి రావడంతో మంగళవారం సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు, డేటా ఎంట్రీ ఆపరేటర్, ఎల్‌జీఎస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వెల్లడించారు.

### 20న సైన్స్ సదస్సు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో చిరుధాన్యాలపై జిల్లాస్థాయి సైన్స్ సదస్సు నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. చిరుధాన్యాలు మంచి పౌష్టికాహారమా లేక ఆహార వ్యామోహమా అనే అంశంపై 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు ఈ సదస్సు ఏర్పాటు చేసినట్టు వివరించారు. అన్ని యాజమాన్యాలలో పనిచేసే పాఠశాలల విద్యార్థులు పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు పాల్గొనవచ్చని స్పష్టం చేశారు. 8 నిమిషాల కాలవ్యవధిలో 6 నిమిషాలలో విద్యార్థులు తమ ప్రాజెక్ట్‌ను న్యాయనిర్ణేతలకు తెలియచేయాలనీ, మిగిలిన రెండు నిమిషాలు న్యాయనిర్ణేతలు విద్యార్థులను ప్రశ్నించి సమాధానాలు రాబడతారని తెలిపారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ఏ.ఏ. మధుకుమార్ 90328 71234ను సంప్రదించాలని కోరారు.

### యార్డుకు 24,716 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 24,716 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 23,897 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి 26,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,500 నుంచి రూ.23,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.12,500 నుంచి 24,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,500 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 9,478 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.


### 22న ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

నగరంపాలెం: గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో సోమవారం జరగాల్సిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. 11న వాయిదా పడిన అభ్యర్థులకు ఈనెల 22న పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### పులిచింతలలో నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులో నీటి నిల్వ క్రమంగా పెరుగుతోంది. సోమవారం సాయంత్రానికి 28 టీఎంసీలకు చేరింది. నదీ పరీవాహక ప్రాంతాలలో కురుస్తున్న భారీ వర్షాలకు గత వారం రోజులలో నీటి నిల్వ సుమారు 7 టీఎంసీలు పెరిగింది. ప్రాజెక్టు సామర్థ్యం 45.77 టీఎంసీలు. ఎగువ నుంచి 8,100 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

### సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 524.50 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 854.70 అడుగుల వద్ద ఉంది.

### నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.8,500, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

# టీడీపీ బంద్ విఫలం

- బయటకు రాని తెలుగు తమ్ముళ్లు
- ఒకటి రెండుచోట్ల తప్ప హడావుడి లేదు
- గుంటూరు పాతబస్తీలో హోటల్‌పై దాడి
- దగ్గర ఉండి షాపులు తెరిపించిన గుంటూరు మేయర్, ఎమ్మెల్యే
- యథావిధిగా నడిచిన ప్రభుత్వ కార్యాలయాలు



గుంటూరులో యథావిధిగా సాగుతున్న జనజీవనం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: చంద్రబాబు నాయుడి అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా తెలుగుదేశం పార్టీ ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు సోమవారం స్పందన కొరవడింది. ఇది తమకు సంబంధం లేని వ్యవహారం అన్నట్లుగా తెలుగు తమ్ముళ్లు వ్యవహరించారు. ఎక్కడా కూడా పట్టుమని పది మంది కూడా బయటకు రాని పరిస్థితి. మరోవైపు జనసేన, సీపీఐ, ఎమ్మార్పీఎస్ మద్దతు ప్రకటించినా వాటి ప్రభావం అంతగా కనిపించలేదు.

- గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఆర్టీసీ బస్సు ఎక్కి టీడీపీ నాయకులు నసీర్ అహ్మద్, నేతలు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. పాత బస్తీలోని బస్టాండ్ సెంటర్‌లో తెరిచి ఉన్న హోటల్స్ మూసివేయాలంటూ నిర్వాహకులను కొందరు బెదిరించి కుర్చీలు బయటకు విసిరికొట్టారు.
- గుంటూరు పశ్చిమలో కొద్దిమంది తెలుగుదేశం నాయకులు, జనసేన నాయకులు కలిసి షాపులు మూయించే యత్నం చేశారు. దీంతో స్పందించిన నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ తదితరులు బ్రాడీపేటలో మూసిన షాపులను తెరిపించారు. దీంతో వైఎస్సార్‌సీపీ, జనసేన నేతల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులు బంద్ చేయిస్తున్న నేతలను అదుపులోకి తీసుకుని అరండల్‌పేట పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.
- నగరంలో ప్రభుత్వ కార్యాలయాలు, పోస్టాఫీసులు, సినిమా థియేటర్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో యథావిధిగా కార్యకలాపాలు సాగాయి. పాఠశాలలకు మాత్రం ముందు జాగ్రత్తగా సెలవు ప్రకటించారు.



బస్టాండ్‌లో బయలుదేరిన ఆర్టీసీ బస్సు

- తాడికొండ నియోజకవర్గం తుళ్లూరు మండలంలో టీడీపీ నాయకులు జెండాలు పట్టుకొని దుకాణాలను బలవంతంగా మూయించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి తెనాలి శ్రావణ్ కుమార్ బంద్‌లో పాల్గొన్నారు.
- మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల మండలాల్లో బంద్ ప్రభావం కనిపించలేదు.
- తెనాలిలో చినరావూరు పార్కు వద్ద ప్రభుత్వ దిష్టిబొమ్మను టీడీపీ నాయకులు, కార్యకర్తలు దహనం చేశారు. దీంతో తెలుగుదేశం, జనసేన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో బంద్ ప్రభావం లేదు. ఆర్టీసీ బస్సులు తిరిగాయి. దుకాణాలు తెరిచారు. కొల్లిపరలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుంపులుగా తిరుగుతూ ప్రభుత్వ కార్యాలయాలు, షాపులను, పాఠశాలల తలుపులను బలవంతంగా మూయించారు.



తెరుచుకున్న షాపింగ్ కాంప్లెక్స్



దుకాణదారులకు మద్దతుగా నిలుస్తున్న మేయర్ మనోహర్‌నాయుడు, ఎమ్మెల్యే మద్దాళి గిరి

- పొన్నూరులో టీడీపీ బంద్ ప్రభావం కనిపించలేదు. యథావిధిగా దుకాణాలు తెరిచారు. ఆర్టీసీ బస్సులు తిరిగాయి. పెదకాకానిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గుంపులుగా తిరుగుతూ ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాల తలుపులు మూయించారు. పెదనందిపాడులో టీడీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంద్ ప్రభావం కనిపించలేదు.

# వృద్ధులు, దివ్యాంగులను తిప్పకోవద్దు

**కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి**

గుంటూరు వెస్ట్: సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వచ్చే వృద్ధులను, దివ్యాంగులను పదేపదే తిప్పుకోవద్దని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారాన్ని సామాజిక బాధ్యతగా చూడాలన్నారు. వారికి సంబంధించి పెండింగ్ అంశాలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న అర్జీలను ఎందుకు పరిష్కరించలేదో తనకు అధికారులు వివరణ ఇవ్వాలని తెలిపారు. స్పందన, జగనన్నకు చెబుదాం లాంటి వేదికలపై వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలతో సిబ్బంది మర్యాదగా వ్యవహరించాలన్నారు. ప్రభుత్వ సేవలు పొందే హక్కు ప్రజలకుందనే అంశాన్ని మరిచిపోకూడదని చెప్పారు. అనంతరం వచ్చిన 45 అర్జీలను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ కలెక్టర్లు సుజాత, వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు.



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

### మోటార్ ట్రైసైకిల్ ఇప్పించండి



మోటారు ట్రై సైకిల్ కోసం నాలుగేళ్లుగా తిప్పుతున్నారు. పేద కుటుంబానికి చెందిన నాకు రెండు కాళ్లు పనిచేయవు. నాలుగేళ్ల క్రితం వాహనం కావాలని అర్జీ పెట్టుకున్నాను. అందరికీ ఇస్తున్నారు గానీ నాకు ఇవ్వడంలేదు. న్యాయం చేయండి.

– బి.జాన్‌వెస్లీ, తోట్ల పాలెం, పొన్నూరు

# చవితి పందిళ్లకు అనుమతి తప్పనిసరి

**ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ వెల్లడి**



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): వినాయక చవితి సందర్భంగా జిల్లాలో పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు స్థానిక పోలీస్‌స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓ (సీఐ)ల అనుమతి విధిగా తీసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హాఫీజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. చవితి మండపాల వద్ద నిబంధనలు పాటించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గణనాథుని ప్రతిమలు ప్రతిష్ఠించేవారు ఐదుగురు లేదా ఎక్కువ మందితో ఒక కమిటీగా ఏర్పడాలని సూచించారు. కమిటీ సభ్యుల గుర్తింపు కార్డుల నకళ్లను పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలని చెప్పారు. ప్రైవేట్, పంచాయతీ, మున్సిపాలిటీ స్థలాల్లో వినాయకుని ప్రతిమలు నెలకొల్పితే స్థల యజమానుల అనుమతి, స్థానికుల సమ్మతి ఉండాలని పేర్కొన్నారు. అగ్నిమాపక, విద్యుత్ శాఖల అనుమతితోపాటు ఇసుక, నీళ్ల డ్రమ్ములను అందుబాటులో ఉంచాలని సూచించారు. దీపారాధన, విద్యుత్ తీగల ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. వినాయకుడి ప్రతిమల ఎత్తు, బరువు, ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనం చేసే తేదీ, వాహనాల వివరాలు తెలపాలని పేర్కొన్నారు. పందిళ్లు, మండపాల వద్ద శబ్ద కాలుష్య క్రమబద్ధీకరణ/ నియంత్రణ నింబంధనలు పాటించాలని వెల్లడించారు. లౌడ్ స్పీకర్లను సాయంత్రం ఆరు గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు ఉపయోగించరాదని వివరించారు. పలు మార్గదర్శకాలను సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరిగితే కమిటీ సభ్యులదే బాధ్యతని స్పష్టం చేశారు.

# జ్యూయలరీ షాపులో భారీ చోరీ

**రూ.40 లక్షల విలువైన సొత్తు అపహరణ**

పొన్నూరు: పొన్నూరు పట్టణంలోని శ్రీవెంకటేశ్వర జ్యుయలరీ షాప్‌లో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు రూ.40 లక్షల విలువైన ఆభరణాలు, నగదు అపహరణకు గురయ్యాయి. ఆదివారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఒకవ్యక్తి షాపు తాళాలు పగలగొట్టి మరీ చోరీకి పాల్పడినట్టు తెలుస్తోంది. సమాచారం తెలుసుకున్న తెనాలి డీఎస్పీ జగన్నాథరావు, సీసీఎస్ డీఎస్పీ ప్రకాష్ బాబు షాపును పరిశీలించారు. క్లూస్ టీం వివరాలను సేకరించింది. షాపు యజమాని ఆలపాటి కిషోర్ ఫిర్యాదు మేరకు అర్బన్ సీఐ ఎం.డి.కె. అల్తాఫ్ హుస్సేన్ కేసు నమోదు చేశారు. పట్టణ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో చోరీకి సంబంధించిన వివరాలను సీఐ అల్తాఫ్ హుస్సేన్ సోమవారం తెలిపారు. సుమారు రూ.40 లక్షల సొత్తు చోరీకి గురైనట్లు చెప్పారు. రూ.11.50 లక్షల నగదు, 575 గ్రాముల బంగారు ఆభరణాలు, మూడు కిలోల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్టు వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



దొంగతనం జరిగిన షాపును పరిశీలిస్తున్న డీఎస్పీ జగన్నాథరావు, సీఐ అల్తాఫ్ హుస్సేన్

# మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

**సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో**

SAKSHI
SAKSHI DIGITAL
MEDIA GROUP

ఆంధ్రప్రదేశ్
ANDHRA PRADESH
AP Pollution Control Board

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరంలాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

**శిబిరం చిరునామా:**

**వివా**
**ది స్కూల్ బై వీవీఐటీ, నంబూరు**
**గుంటూరు జిల్లా**
**తేది : 16-09-2023 (శనివారం)**
**సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.**
**రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 97030 13015**

District sponsor
VIVA
THE SCHOOL BY VVIT

# ఆదర్శ, అంతర్జాతీయ విద్యకు ఏపీ నిలయం

- మనోధైర్యాన్నిచ్చే విజ్ఞానాన్ని అందించడమే సీఎం జగన్ లక్ష్యం
- సాంకేతికత, నైపుణ్యంతో కూడిన విద్యను ప్రభుత్వం అందిస్తోంది
- రానున్న ఐదేళ్లలో ఈ సంస్కరణల ఫలితాలు కనిపిస్తాయి
- ప్రభుత్వం అందిస్తున్న వసతులు సద్వినియోగం చేసుకోండి
- ఏఎన్‌యూ వ్యవస్థాపక దినోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



ప్రభుత్వ సేవా రంగంలో విశిష్ట కృషి చేసిన కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డికి ప్రతిభా పురస్కారం ప్రదానం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఏఎన్‌యూ వీసీ రాజశేఖర్

ఏఎన్‌యూ(గుంటూరు): ఆదర్శవంత, అంతర్జాతీయ విద్యకు ఆంధ్రప్రదేశ్ నిలయంగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సోమవారం జరిగిన యూనివర్సిటీ 46, 47వ వ్యవస్థాపక దినోత్సవంలో సజ్జల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ యువతకు సంపూర్ణ మనోధైర్యాన్నిచ్చే విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపడుతున్నారన్నారు. ప్రపంచ విద్యారంగంలో ఏపీకి ప్రత్యేక చోటు దక్కుతోందన్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతికత, ఉపాధికి దోహదం చేసే నైపుణ్య లక్షణాలతో కూడిన పరిపూర్ణ విద్యను ఏపీలో అన్నివర్గాలకు అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎంకే దక్కుతోందన్నారు. జాతీయ విద్యా విధానంలోని అంశాలన్నీ అమలు చేస్తూ విద్యార్థుల పరిపూర్ణ భవిష్యత్ రూపకల్పన ఒక్క ఏపీలోనే జరుగుతోందన్నారు. కేజీ నుంచి పీజీ వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అన్ని వర్గాలకు చేరువ చేయడం జరిగిందన్నారు. డిజిటల్ లైబ్రరీలు, టెక్నాలజీ వినియోగంతోపాటు పలు ఆధునిక అంశాలు విద్యార్థులకు చేరువయ్యాయని, వాటి ఫలితాలు రానున్న ఐదేళ్లలో కనిపిస్తాయన్నారు. ఉన్నత ఆశయంతో ఏపీ ప్రభుత్వం అందిస్తోన్న వసతులు, విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని దేశ, రాష్ట్ర భవిష్యత్ నిర్ణయించే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. ప్రస్తుతం అవకాశాలు అనంతంగా ఉన్నాయని, వాటిని అందిపుచ్చుకునే నైపుణ్యాన్ని యువత పెంపొందించుకోవాలని సూచించారు. సమాజంలో పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన వ్యక్తులకు ఏఎన్‌యూ పురస్కారాలు ప్రదానం చేయడం హర్షణీయమన్నారు. ఆయా రంగాలలో ప్రతిభ కనబరిచిన వారికి సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి ఉంటుందన్నారు. సమాజానికి ఉపయోగపడే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. దేశంలోనే ఏఎన్‌యూ ప్రత్యేకతను సొంతం చేసుకుంటుందన్నారు. పలు రంగాలలో ప్రతిభ కనబరిచిన 22 మందికి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, మాజీ వీసీ ఆచార్య వి.బాలమోహన్‌దాస్, రెక్టార్ ఆచార్య పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, వ్యవస్థాపక దినోత్సవ కో-ఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు, పలువురు అధికారులు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- వైద్యసేవ పురస్కార గ్రహీత, న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తన తండ్రి ఏఎన్‌యూ ఉద్యోగి అని, వర్సిటీకి చాలా రుణపడి ఉన్నానన్నారు.
- మరో వైద్యసేవ పురస్కార గ్రహీత గుంటూరు వైద్య కళాశాల అధ్యాపకురాలు ఆచార్య వడ్లమూడి విజేత మాట్లాడుతూ వైద్యరంగాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.
- జానపద పురస్కార గ్రహీత తెలంగాణ జానపద కళాకారుడు జయరాజ్ మాట్లాడుతూ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యమిస్తే నేడు ఆయన కుమారుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏపీలో ఇంగ్లిష్ మీడియం బోధన ప్రవేశ పెట్టడంతోపాటు అనేక విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తున్నారన్నారు.

వీరితోపాటు జయప్రద రామమూర్తి( శాస్త్రీయ సంగీతం), గద్దె మంగయ్య ( విద్య, దాతృత్వ రంగం), దాసరి రామకృష్ణ (సైన్స్ అండ్ టెక్నాలజీ), డాక్టర్ మాకినేని కిరణ్(వైద్య, సేవా రంగం), ఎస్ హనుమంతరావు(కళారంగం), మాస్టార్జీ (సామాజిక కళా సేవా రంగం), డాక్టర్ కోయి కోటేశ్వరరావు(సాహిత్య రంగం), ఆశిరయ్య (జానపద కళారంగం), సిస్టర్ రోసలీన( సేవా రంగం), మల్లాది సూరిబాబు ( శాస్త్రీయ సంగీత రంగం), ఆర్ గోపాలకృష్ణ( విద్యా రంగం) తరుపున గుంటూరు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కాలేజ్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డాక్టర్ గీతా రెడ్డి (మహిళా సాధికారిత రంగం), శారదా శృంగేరి (లిటరేచర్ అండ్ సేవా రంగం), డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ(పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ రంగం), డాక్టర్ ఎస్ఎస్‌వి రమణ(ప్రజా వైద్య రంగం), సయ్యద్ మౌలాలి(గ్రామీణ పారిశ్రామిక రంగం), దర్శనం మొగలయ్య (కళా రంగం) ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. మొగలయ్య, ఆశిరయ్య జయరాజ్ గీతాలు పాడి తమ కళను ప్రదర్శించారు. ప్రభుత్వ సేవా రంగంలో పురస్కారం అందుకోవాల్సిన ఐఏఎస్ అధికారి గిరిజాశంకర్ త్రిపురలో ఉండటం వల్ల కార్యక్రమానికి రాలేకపోయారు. అలాగే యూనివర్సిటీలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ పరిశోధనా పత్రాలు సమర్పించిన వారికి, ఉత్తమ పేటెంట్‌లు పొందిన వారికి అవార్డుల ప్రదానం జరిగింది.

### ఏఎన్‌యూ పురస్కారం పూర్వజన్మ సుకృతం

**పురస్కార గ్రహీత, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి**

ఏఎన్‌యూ(గుంటూరు) : సేవలను గుర్తించి పురస్కారాన్ని ప్రదానం చేయడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చేతులమీదుగా ప్రతిభా పురస్కారాన్ని అందుకున్న కలెక్టర్ మాట్లాడుతూ ఈ పురస్కారం తన పూర్వజన్మ సుకృతంగా, ఏఎన్‌యూ నుంచి దక్కిన అరుదైన గౌరవంగా భావిస్తానని పేర్కొన్నారు. పురస్కారాలు మరింత బాధ్యతను పెంచుతాయన్నారు. 2007 నుంచి అనేక హోదాల్లో పనిచేసిన తనకు 2022లో చైతన్యవంతమైన గుంటూరు జిల్లాకు కలెక్టర్‌గా సేవలందించే మహత్తర అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిందన్నారు.

### ప్రతిభావంతులను సన్మానించడం గర్వంగా ఉంది

సభలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ప్రసంగిస్తూ సమాజంలోని వివిధ రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన వారిని యూనివర్సిటీ పురస్కారంతో సన్మానించడం గర్వంగా ఉందన్నారు. వీరిలో అత్యధికులు అట్టడుగు స్థాయి నుంచి తమ ప్రతిభతో అత్యున్నత స్థాయికి ఎదిగినవారేనన్నారు. ఏఎన్‌యూ ప్రగతి గురించి వివరించారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, వ్యవస్థాపక దినోత్సవం కో-ఆర్డినేటర్ ఆచార్య కె.మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతినే పూజిద్దాం

## జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, జేసీ రాజకుమారి, ఇతర అధికారులు

**గుంటూరు వెస్ట్:** పవిత్ర పండుగల్లోనూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కాలుష్య నియంత్రణ మండలి రూపొందించిన మట్టి గణపతినే పూజిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం క్యాలెండర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్వో చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్లు సుజాత, వెంకట శివరామిరెడ్డి, జిల్లా అధికారులు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణపతి విగ్రహాలను ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, రసాయనాలతో కూడిన రంగులను వాడొద్దని కోరారు. మట్టితో చేసిన విగ్రహాల తయారీలో లభ్యమయ్యే పత్తి, నార పదార్థాలతోపాటు సహజ సిద్ధమైన రంగులు వాడాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నారాయణ, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఉపరితల ఆవర్తనంతో భారీ వర్షాలు

- తాడికొండలో 111.6 మి.మీ వర్షం
- సగటున 64.6 మి.మీ వర్షపాతం

**కొరిటిపాడు(గుంటూరు):** బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనంతో గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా తాడికొండ మండలంలో 111.6 మిల్లీ మీటర్ల వర్షం పడగా, అత్యల్పంగా ఫిరంగిపురం మండలంలో 26.8 మి.మీ వర్షం పడింది. సగటున 64.6 మి.మీ వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి 107, దుగ్గిరాల 103.4, పొన్నూరు 101.8, తాడేపల్లి 98.6, కొల్లిపర 95.2, తుళ్లూరు 94.2, పెదకాకాని 71.8, ప్రత్తిపాడు 60.4, గుంటూరు తూర్పు 45.6, మేడికొండూరు 44, గుంటూరు పశ్చిమ 42, వట్టిచెరుకూరు 38.4, కాకుమాను 32.4, చేబ్రోలు 32, తెనాలి 29.2, పెదనందిపాడు 28.4, ఫిరంగిపురం మండలంలో 26.8 మి.మీ చొప్పున వర్షం పడింది. సెప్టెంబరు నెల 11వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 51.5 మి.మీ పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 161.3 మి.మీ వర్షపాతం నమోదైంది. మరో రెండు, మూడు రోజుల పాటు జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు.

## రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘంలో గీత, ప్రసాద్‌లకు చోటు

**గుంటూరు వెస్ట్ (క్రీడలు):** రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘంలో జిల్లాకు చెందిన డబుల్ ఒలింపియన్, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్తె గీత, అథ్లెటిక్స్ కోచ్ జీవీఎస్ ప్రసాద్‌లకు చోటు దక్కింది. గీతను ఉపాధ్యక్షురాలిగా, ప్రసాద్‌ను సంయుక్త కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వారికికోచ్‌లు అభినందనలు తెలిపారు.



## రైల్వే క్లెయిమ్స్ లోక్ అదాలత్




లోక్ అదాలత్‌లో కేసులను పరిశీలిస్తున్న రైల్వే డీఆర్ఎం రామకృష్ణ

**లక్ష్మీపురం:** రైల్వే ప్రయాణికులకు సత్వర న్యాయం అందించడానికి రైల్వే డివిజన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు, ప్రమాదాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న కేసులు పరిష్కరించేందుకు రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యూనల్ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేసినట్లు గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని రైల్వేకోర్టులో సోమవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈనెల 11 నుంచి 14వ తేదీవరకు లోక్ అదాలత్ కొనసాగుతోందన్నారు. రోజుకు వంద కేసులు పరిష్కరించేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రైలు ప్రమాదాల బాధితులకు త్వరితగతిన పరిహారం చెల్లించడం ద్వారా రైలు వినియోగదారులకు ఉపశమనం కలిగించడం లోక్ అదాలత్ ప్రధాన లక్ష్యంగా చెప్పారు. అనంతరం పలు లోక్ అదాలత్‌లో వచ్చిన కేసులను పరిశీలించారు. రైల్వే అధికారులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిభకు పురస్కారం

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విభిన్న రంగాల్లో విశేష ప్రతిభ కనపరిచిన వారికి పురస్కారాలను వీసీ రాజశేఖర్ ప్రదానం చేశారు. పురస్కారాలు అందుకున్న వారిలో..

– ఏఎన్‌యూ



జయప్రద రామమూర్తి, శాస్త్రీయ సంగీతం



గద్దె మంగయ్య విద్య, దాతృత్వ రంగం



దాసరి రామకృష్ణ, సైన్స్ అండ్ టెక్నాలజీ రంగం



డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి, వైద్య, సేవారంగం



డాక్టర్ కిరణ్ మాకినేని, వైద్య, సేవారంగం



నడింపల్లి హనుమంతరావు, కళారంగం



మాస్టార్జీ, సామాజిక కళాసేవారంగం



డాక్టర్ కోయి కోటేశ్వరరావు, సాహిత్య రంగం



అశిరయ్య, జానపద కళారంగం



డాక్టర్ రోసలీన, సేవారంగం



మల్లాది సూరిబాబు, రాష్ట్రీయ సంగీత రంగం



ఆర్.గోపాలకృష్ణ, విద్యారంగం



డాక్టర్ గీతారెడ్డి, మహిళా సాధికారత రంగం



శారదా శృంగేరి, లిటరేచర్ అండ్ సేవా రంగం



డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ, పెర్‌ఫార్మింగ్ ఆర్ట్స్ రంగం



ఆచార్య వడ్లమూడి విజేత, ప్రత్యేక ప్రతిభా రంగం



డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, ప్రజావైద్య రంగం



జయరాజు, జానపద సంగీత రంగం



సయ్యద్ మౌలాలి, గ్రామీణ పారిశ్రామిక రంగం



పద్మశ్రీ దర్శనం మొగులయ్య, కళారంగం

## అన్నదమ్ములకు అవార్డులు

**ఏఎన్‌యూ:** ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవంలో ఒకే వేదికపై అన్నదమ్ములు అవార్డులు అందుకున్న అరుదైన ఘటన చోటు చేసుకుంది. గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి చెందిన న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి వైద్య, సేవా రంగంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రతిభా పురస్కారాన్ని అందుకున్నారు. 18 వేలకు పైగా సర్జరీలు చేయడంతోపాటు ఆధునిక పరిజ్ఞానాన్ని, తన వైద్య నైపుణ్యాన్ని కనబరచి రోగికి బాహుబలి సినిమా చూపిస్తూ మెదడులోని ట్యూమర్‌ని తొలగించి 'బాహుబలి సర్జన్'గా ఈయన గుర్తింపు పొందారు. కరోనా సమయంలో తన రెండు నెలల జీతాన్ని ప్రభుత్వానికి విరాళంగా అందించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మొదటి వైద్యుడిగా నిలిచారు. ఏఎన్‌యూలోని డాక్టర్ వైఎస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన తమ్ముడు డాక్టర్ భవనం నాగకిషోర్ ప్రభుత్వం ఆమోదించిన పేటెంట్‌ల అవార్డుల కేటగిరీలో వ్యవస్థాపక దినోత్సవంలో మొదటి బహుమతిని వీసీ చేతులమీదుగా అందుకున్నారు.

## సామాజిక బాధ్యత వివరించాలి

### జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి సూచన



**గుంటూరు వెస్ట్:** ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాల, కళాశాలల్లో అధ్యాపకులు విద్యార్థులకు సామాజిక బాధ్యత గురించి వివరించాలని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో జూనియర్ రెడ్ క్రాస్ వింగ్‌ను ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక బాధ్యత తెలిస్తే దేశానికి ఉత్తమ సేవలందించే గుణాలు ఏర్పడతాయన్నారు. దీనికి సంబంధించిన శిక్షణ రెడ్‌క్రాస్ సంస్థ ఏర్పాటు చేస్తుందన్నారు. మొక్కలు పెంపకం, ప్లాస్టిక్ నివారణ, ఆరోగ్య మెలకువలు, సాయం చేసే గుణం తదితర అంశాల్లో శిక్షణనిస్తారన్నారు. జిల్లాలోని ప్రతి విద్యార్థిని జూనియర్ రెడ్ క్రాస్‌వింగ్ సభ్యునిగా చేర్చాలన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు మాట్లాడుతూ వార్ ఆన్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్, ట్రాఫిక్, సోషల్ పోలీసింగ్ వంటి అంశాల్లో విద్యార్థులకు శిక్షణనిచ్చి వాటిలో పరీక్షలు కూడా పెడతామన్నారు. ప్రతిభకనబరచిన వారికి బహుమతులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి ఎ.రవిశ్రీనివాస్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, డీఈఓ శైలజ, అధికారులు పాల్గొన్నారు.

# ఫిర్యాదిదారులకు న్యాయం జరగాలి

- ఏఎస్పీ శ్రీనివాసరావు
- ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్



అర్జీదారుల సమస్యను ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, పక్కన డీఎస్పీ రామారావు

**నగరంపాలెం:** సింగ్‌పూర్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకులు మోసగించారని ఒకరు.. కలెక్టర్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మహిళ డబ్బులు తీసుకుని ముఖం చాటేసిందని మరొకరు పోలీసులను ఆశ్రయించారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం స్పందన (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) జరిగింది. అర్జీదారుల నుంచి జిల్లా ఏఎస్పీ శ్రీనివాసరావు (క్రైం) అర్జీలు స్వీకరించారు. బాధితుల ఫిర్యాదులను సమస్యలను ఆలకించారు. అనంతరం పలువురు పోలీస్ అధికారులతో మొబైల్ ఫోన్‌లో మాట్లాడారు. స్పందనకు వచ్చే ఫిర్యాదులను చట్టపరంగా విచారించి, త్వరితగతిన న్యాయం చేస్తామని ఏఎస్పీ చెప్పారు. డీఎస్పీ కేసీహెచ్.రామారావు (దిశ పీఎస్) అర్జీలు స్వీకరించారు.

### సింగ్‌పూర్‌లో ఉద్యోగాలంటూ..

గతంలో విదేశాల్లో ఉద్యోగానికై వీక్షిస్తున్నా.. ఈ క్రమంలో తెలిసిన వారి ద్వారా ఓ కన్సల్టెన్సీ డైరెక్టర్, అతని సహాయకురాల్ని సంప్రదించా. సింగ్‌పూర్‌కు వీసా, అక్కడే ఉద్యోగం యిప్పించేలా రూ.4.50 లక్షలు చెప్పగా.. 2021 ఏప్రిల్ 13 నుంచి ఫోన్‌పే, బ్యాంక్ ఖాతాకు రూ.1.50 లక్షలు చెల్లించా. దీంతో వారు వీసా పంపించగా, దాన్ని నా ఫేస్‌బుక్ (ఎఫ్‌బీ)లో అప్‌లోడ్ చేశా. నా వీసా చూసి ఎఫ్‌బీ మిత్రులు అడగ్గా, వారికి చిరునామా పంపించా. వారు సైతం సింగపూర్ వచ్చేందుకు సిద్ధపడి, కొంత నగదు కన్సల్టెన్సీకి చెల్లించారు. దీంతో వాళ్లకు వీసాలు వచ్చాయి. రెండో వాయిదాలో కొంత పైకం కన్సల్టెన్సీకి చెల్లించాలని, నా ఖాతాకు పంపించారు. ఆ మొత్తాన్ని వారికి పంపించా. దీంతో మూడు నెలలో సింగ్‌పూర్ వెళ్తారని, లేనిచో నగదు చెల్లిస్తామని నమ్మబలికారు. గతేడాది సెప్టెంబర్‌లో ఇద్దరికి టిక్కెట్లు / వీసాలిచ్చి, హైదరాబాద్-చెన్నై పంపించారు. అక్కడ వీసాలను పరిశీలించి, నకిలీవి అని తేల్చారు. ఇప్పటి వరకు కన్సల్టెన్సీకి బ్యాంక్ ఖాతా, నగదు రూపేణా రూ.14.65 లక్షలు చెల్లించాం. ఆ మొత్తాన్ని తిరిగి ఇవ్వాలని పలుమార్లు అడిగినా ఫలితం లేదు. నా ద్వారా ఒకరి డబ్బులను కన్సల్టెన్సీకి చెల్లించగా, అతను నగదు యివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. మోసగించిన కన్సల్టెన్సీపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– ఉదయ భాస్కర్ రెడ్డి, బాలాజీనగర్, పాతగుంటూరు.

### ఐటీ సెక్టార్‌లో..

గతేడాది ఆగస్టు 18న బెంగుళూర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఉద్యోగ కన్సల్టెన్సీ ఉందని, ఐటీ సెక్టార్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ.1.30 లక్షలు చెల్లించాలని చెప్పగా, గతేడాది ఆగస్టు 24 నుంచి దఫాల వారీగా గుగూల్ పే, ఫోన్ పే ద్వారా రూ.1.30 లక్షలు చెల్లించా. నెలరోజుల్లో ఉద్యోగం వస్తుందని బదులిచ్చాడు. ఈ విషయమై స్నేహితులతో చర్చించా. సదరు వ్యక్తి ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థుల నంబర్లు తీసుకుని, ఉద్యోగాల పేరుతో మోసగించే వాడని పేర్కొన్నారు. దీంతో డబ్బులు అడిగితే అసభ్య పదజాలంతో బెదిరిస్తున్నారు. అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, న్యాయం చేయగలరు.

–ఎస్ఎం.నిజాముద్దీన్, దఫ్‌పేట, పొన్నూరు.

### కలెక్టరేట్‌లో ఉద్యోగమని..

ప్రస్తుతం బ్యాంక్ కోచింగ్ తీసుకుంటున్నా. గతేడాది పొన్నూరుకి చెందిన ఓ మహిళ పరిచయమైంది. గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది. దీంతో గతేడాది జూన్‌లో బీఆర్ స్టేడియం వద్ద ఓ రూంలో ఫోన్ పే ద్వారా ఆమెకు రూ.2 లక్షలు చెల్లించా. మూడు నెలలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పగా, నెలలు గడిచాయి. ఉద్యోగ విషయమై ఆమెను అడిగితే రూ.34 వేలు తిరిగి చెల్లించింది. మిగతా డబ్బులు అడిగితే మొబైల్ స్విచ్ఛాఫ్ వస్తోంది.

– జె.గోపీ, జగ్గయ్యపేట, విజయవాడ.

## జాతీయస్థాయి పద్యనాటక పోటీల విజేతలు వీరే..


**విజయవాడ కల్చరల్:** శ్రీదేవి కళా నాట్యమండలి, గుమ్మడి జయరాజ్ కళాపీఠం, సాయి హృదయ నాట్య మండలి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదికపై ఈ నెల 9, 10 తేదీల్లో జరిగిన సత్యహరిశ్చంద్ర నాటక పద్యగాన పోటీల విజేతలను నిర్వాహక సంఘ సభ్యులు గుమ్మడి జయరాజ్, అవినాష్ గుమ్మడి, అరుగు త్రినాథనాయుడు సోమవారం ఒక ప్రకటనలో ప్రకటించారు. గుంటూరుకు చెందిన తేళ్ల రామారావు ప్రథమ బహుమతి, ఎన్టీఆర్ జిల్లాలోని చందర్లపాడుకు చెందిన కస్తాల దుర్గారావుకు ద్వితీయ, పల్నాడు జిల్లా అచ్చంపేటకు చెందిన నీలం దుర్గారావు తృతీయ బహుమతి పొందారు. దొడ్డా మిషాక్ రాజు(కృష్ణా), కె.ఇజ్రాయిల్(బాపట్ల), ముత్యాల నాగేశ్వరరావు (కృష్ణా), మరియదాసు(గుంటూరు), వి.వి.శివారెడ్డి(గుంటూరు)కి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. వి.నారాయణ (మహబూబ్‌నగర్), పాణ్యం దత్తాశర్మ(హైదరాబాద్)కు ప్రత్యేక బహుమతులను ప్రకటించి నగదు బహుమతిని అందజేశారు. న్యాయనిర్ణేతలుగా వేమూరి నాగేశ్వరశర్మ, సుబ్బరాజు, పుష్పాల ఆంజనేయులు, నిమ్మగడ్డ ఏసుపాదం వ్యవహరించినట్లు తెలిపారు.

## 20 నుంచి కంప్యూటర్ ట్యాలీలో ఉచిత శిక్షణ

**కొరిటెపాడు(గుంటూరు):** యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీ నుంచి కంప్యూటర్ ట్యాలీ, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్‌లో ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ జి.బి.కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు ఉచిత హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. వయస్సు 19 నుంచి 44 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు. ఆసక్తి గల అభ్యర్థులు కొత్తపేటలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ కార్యాలయంలో తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కంప్యూటర్ ట్యాలీ కోర్సుకు 10వ తరగతి మార్కుల జాబితా కాపీ (పాస్ లేదా ఫెయిల్) జతపర్చాలన్నారు. ఈ అవకాశాన్ని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత మహిళలు, నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ, ఓల్డ్ బ్యాంక్ వీధి, కొత్తపేట, 0863-2336912, 8125397953, 9700687696, 9949930155 ఫోన్ నంబర్లను సంప్రదించాలని ఆయన తెలియజేశారు.

## కోర్టు ప్రాంగణంలో మామపై అల్లుడి దాడి

- విడాకుల కేసులో కోర్టుకు హాజరైన దంపతులు
- ఇరువర్గాల ఘర్షణ
- మామను గాయపరిచిన అల్లుడు



చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు

**గుంటూరు ఈస్ట్:** జిల్లా కోర్టు ప్రాంగణంలో అల్లుడు మామపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నగరంపాలెం ఎస్‌హెచ్ఓ హైమారావు కథనం ప్రకారం మేడికొండూరు మండలం కొర్రపాడు గ్రామానికి చెందిన దారా శ్రీను ఆర్మీ జవాన్‌గా పని చేస్తున్నాడు. సెలవులపై ఇంటికి వచ్చాడు. భార్య వెంకట లక్ష్మిలు మనస్పర్థలతో విడిపోయారు. కోర్టులో విడాకులకు సంబంధించి కేసు నడుస్తోంది. వాయిదాలకు హాజరయ్యేందుకు దారా శ్రీను, అతని బంధువులు, వెంకటలక్ష్మి, బంధువులు సోమవారం కోర్టుకు వచ్చారు. కోర్టు ప్రాంగణంలో పరస్పరం ఇరువర్గాలు ఎదురుపడి మాటామాటా అనుకోవడంతో వివాదం పెద్దదైంది. దీంతో అల్లుడు శ్రీను మామ శ్రీనివాసరావుపై దాడిచేశాడు. ద్విచక్రవాహనం తాళంతో శ్రీనివాసరావు చెవి పక్కన బలంగా గుద్దాడు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయమైంది. క్షతగాత్రుడిని స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.